"ప్రపంచమంతా నా కళ్ళకు ఆరవేసిన సిల్కు చీరలా కనిపిస్తూంది!" అని.

ఇంతగా తన హృదయంవిప్పి నాతో చెప్పగలిగిన ఆ మిత్రుణ్ని నేను ఈ రోజువరకూ అభినందించి, మెచ్చుకుంటాను. ఎందుకంటారా? తప్పనిసరియైన నిజాన్ని చెప్పడానికి అతడు సందేహించలేదు గనక!

* * *

కొందరు మగవాళ్లు తమ ఆడవాళ్ళమీద తమకు గల ప్రేమాతిశయాలన్నిట్నీ కొత్తచీరల రూపంతో ప్రదర్శిస్తూంటారు. ఈ కొత్త చీరలుచూసి తమ భార్యలు తమను మెచ్చుకోవాలనీ కాదు-తమ ఘనత వారికి చూపెడదామనీ కాదు - తమ కంటి కింపైన చీరలో తమ ఆడవాళ్ళనుచూస్తే వచ్చే ఆనందాన్ని, పారవశ్యాన్ని పొందుదామని! అందమైన చీరల్ని నిషేధించి ఆడవాళ్ల నందర్నీ అలుకుగుడ్డలతో అలంకరించండి - ఆ మర్నాటినుంచీ విడాకులకోర్టులు అమలులోకి రాకపోతే చెవి తెగ్గోసుకుంటాను!

---

# పునాదిరాళ్లు

"నీకు నెలకు పదహారువేలొస్తే సరిపోతుందా?"

'పదహారువేలా? ఏమిటవి—రాళ్లా రప్పలా?'

'రూపాయలు! పదహారువేల రూపాయలు—?'

'ఒక నెలకా?'

'అవును-నెలకు పదహారువేల రూపాయలు-సరిపోతుందా?'

'ఆలోచించి చూడాలి-సరిపోతుందో లేదో-ఈ కరువు రోజుల్లో-'

'ఆలోచించిచూడు. రేపు చెబుతావా?'

'ఈ రాత్రి ఆలోచిస్తా-పదహారూ వేలేనా, పైగా డియర్‌నెస్ అలవెన్సుకూడా ఏమైనా...?'

'అది నేను ఆలోచించాల్సిన విషయం-కొంచం కైమిస్తే ఆలోచించి చెబుతా-'